సాక్షి విశాఖపట్నం

మంగళవారం ౹ 4 ౹ ఫిబ్రవరి ౹ 2025



అలా.. మత్స్యలోకంలో.. 8లో



సింహగిరిపై అక్షరాభ్యాసాలు 8లో



పోలమ్మకు రాళ్లే నైవేద్యం 8లో

జలచరాల కనువిందు



స్టార్‌ ఫిష్‌



సీ స్లగ్‌



సీ కౌరీ

సముద్ర గర్భంలో రాళ్లపై మనుగడ సాగించే జలచరాలు ఒడ్డుకు వచ్చి సందర్శకులకు కనువిందు చేశాయి. సీలెన్‌ట్రిటా జాతికి చెందిన స్టార్‌ఫిష్‌, సీ ఫ్యాన్‌, సీ లిల్లీ, సీ స్లగ్‌ వంటి విభిన్న ఆకృతుల్లో ఉండే జీవరాశులు వైఎంసీఏకి ఎదురుగా ఉన్న సముద్రం ఒడ్డున కనిపించగా 'సాక్షి' కెమెరాలో బంధించింది. స్టార్‌ ఫిష్‌ పట్టుకుంటే లేదా శరీరానికి తాకితే దద్దుర్లు వస్తాయని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. వీటితో ఎటువంటి ఉపయోగం ఉండదని, ఇవి సముద్రం లోపల రాళ్ల ప్రదేశాల్లో ఎక్కువగా ఉంటాయని పేర్కొంటున్నారు.

– ఫొటోలు, సాక్షి, ఫొటోగ్రాఫర్‌, విశాఖపట్నం



సముద్రంలో సీ లిల్లీ



ఒడ్డున సీ లిల్లీ

న్యూస్‌రీల్‌

శ్రీవారి భక్తులకు సువర్ణావకాశం



శ్రీవారికి సమర్పించే మేల్చాట్‌ వస్త్రం

కొమ్మాది : టీటీడీ సంప్రదాయం ప్రకారం ప్రతి శుక్రవారం శ్రీవారికి మేల్చాట్‌ వస్త్రాన్ని (పట్టు వస్త్రం) ధరింపచేస్తారు. ఈ వస్త్రాన్ని తిరుమలలో శ్రీవారికి అందించాలనేది ఎందరో భక్తుల ఆకాంక్ష. ఈ అవకాశాన్ని రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు కల్పిస్తున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు పేర్కొన్నారు. భక్తుల ఆకాంక్ష మేరకు ఇక్కడ ఆలయంలో శ్రీవారికి మేల్చాట్‌ వస్త్రాన్ని స్వయంగా అందించే సువర్ణావకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. ఈ మేల్చాట్‌ వస్త్రం రూ.30 వేల నుంచి రూ.80 వేలు వరకు ఉంటుందన్నారు. వివరాలకు 9866397593, 8074404845 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌లో 438 మంది సీఐఎస్‌ఎఫ్‌ సిబ్బంది తగ్గింపు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌ వ్యయ నియంత్రణ చర్యలో భాగంగా 438 మంది సీఐఎస్‌ఎఫ్‌ సిబ్బందిని తగ్గించారు. ఈ మేరకు దేశంలోని వివిధ సంస్థలకు బదిలీ చేస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు చెందిన సీఐఎస్‌ఎఫ్‌ ఐజీ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల స్టీల్‌ప్లాంట్‌ చేపడుతున్న అనేక నియంత్రణ చర్యల్లో భాగంగా సిబ్బంది తొలగింపు గురించి సీఐఎస్‌ఎఫ్‌ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీనిపై జరిగిన అనేక సమావేశాల అనంతరం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇంత వరకు సీఐఎస్‌ఎఫ్‌లో 833 మంది సెక్యూరిటీ విధులు, ఫైర్‌ వింగ్‌లో 200 మందితో కలిపి మొత్తం 1033 మంది విధులు నిర్వహించేవారు. 438 మందిని తొలగించడంతో సెక్యూరిటీలో 429 మంది, ఫైర్‌ వింగ్‌లో 167 మందితో కలిపి మొత్తం 596 మంది సిబ్బంది మిగిలారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పొడిగింపు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో 2025 జనవరి విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాల గడువు ఈ నెల 15 వరకు పొడిగించినట్లు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్‌ గోనిపాటి ధర్మారావు తెలిపారు. డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్‌ కోర్సులతో పాటు ఆన్‌లైన్‌ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారని పేర్కొన్నారు. https://ignouadmission.samarth.edu.in వెబ్‌సైట్‌ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

తొలి రోజు నామినేషన్లు నిల్‌

మహారాణిపేట: ఉత్తరాంధ్ర టీచర్‌ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తొలి రోజు సోమవారం ఒక్క నామినేషన్లు కూడా దాఖలు కాలేదు. నామినేషన్లు అన్ని ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 11 నుంచి 3 గంటల వరకు విశాఖ కలెక్టర్‌ కార్యాలయంలో స్వీకరిస్తారు. 10వ తేదీ సాయంత్రం 3 గంటలతో నామినేషన్లు స్వీకరణ ప్రక్రియ ముగుస్తుంది. 11న పరిశీలన, 13న మధ్యాహ్నం 3 గంటల లోపు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. 27న పోలింగ్‌, మార్చి 3న కౌంటింగ్‌ జరగనుంది.

ఆరోపణలున్న అధికారులకే అందలం



- వీఎంఆర్‌డీఏలో చక్రం తిప్పుతున్న కొందరు ఏవోలు
- ఇటీవలే బ్యాటరీ కార్ల వ్యవహారంలో ఒక అధికారిపై బదిలీ వేటు
- తాజాగా మరో అధికారి వ్యవహార శైలిపై ఆరోపణలు
- సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన

విశాఖ సిటీ: విశాఖపట్నం మెట్రోపాలిటన్‌ రీజియన్‌ డెవలప్‌మెంట్‌ అథారిటీ(వీఎంఆర్‌డీఏ)లో 'పరిపాలన' పక్కదారి పడుతోంది. కొన్ని విభాగాల్లో అధికారుల వ్యవహార తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు బినామీలతో కాంట్రాక్టు పనులు చేస్తుంటే.. మరికొందరు ఉద్యోగాలు, బదిలీల పేరుతో డబ్బులు వసూలు చేయడం, సహచర ఉద్యోగులపై దురుసుగా ప్రవర్తిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్న వార్తలు గుప్పుమంటున్నాయి. ఇటీవలే కైలాసగిరిపై బ్యాటరీ కార్ల నిర్వహణ వ్యవహారంలో ఒక పరిపాలనాధికారిపై బదిలీ వేటు పడగా.. తాజాగా మరో విభాగంలో పరిపాలనాధికారి పనితీరుపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయ పలుకుబడితో ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకొని విభాగంలో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు.

రెండేళ్లు మాయమైపోయి..

ఆ అధికారి వ్యవహార శైలి మొదటి నుంచి వివాదాస్పదంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన సర్వీస్‌ రిజిస్టర్‌ పరిశీలిస్తే అసలు చిట్టా బయటపడుతుందని కొంత మంది సిబ్బంది చెవులు కొరుక్కుంటున్నారు. అవినీతి ఆరోపణలతో ఎనిమిదేళ్ల క్రితం రెండేళ్లపాటు కనిపించకుండా పోయినట్లు తెలుస్తోంది. ఆ తరువాత రాజకీయ నాయకుల అండదండలతో అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి మళ్లీ విధుల్లో చేరినట్లు విభాగంలో చర్చించుకుంటున్నారు. వచ్చిన తరువాత కూడా అవుట్‌ సోర్సింగ్‌ ఉద్యోగాలు ఇప్పిస్తామని.. అవసరమైన చోటుకు బదిలీ చేయిస్తానంటూ కొంత మంది నుంచి వసూళ్లకు పాల్పడి భారీగానే 'ఆదాయం' ఆర్జించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సిబ్బందిపై వేధింపులు?

సదరు అధికారి సహచర సిబ్బందిపై వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. సీనియారిటీ, మహిళా ఉద్యోగులు అనే ఆలోచన లేకుండా ప్రతి ఒక్కరిపై నోరు పారేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సందర్భం లేకుండానే ఏదో ఒక కారణంతో సిబ్బందిపై చిందులు తొక్కుతూ, ఎవరైనా ప్రశ్నిస్తే.. బదిలీ చేయిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు అధికారి వ్యవహార శైలిపై విసుగెత్తిపోయిన కొంత మంది సిబ్బంది ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే తన పలుకుబడి, ఎవరినైనా ప్రసన్నం చేసుకునే తెలివి తేటలతో అధికారులను సైతం బుట్టలో వేసుకునే అవకాశం ఉందని మరికొందరు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే.. సంస్థ నిర్వహణ, మనుగడకు కీలకమైన ఆ విభాగంలో సదరు అధికారి కారణంగా సిబ్బంది ఇబ్బందులు పడుతున్నా.. పై అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని కీలకమైన విభాగంలో కొనసాగించడంపై కూడా అనేక అనుమానాలకు తావిస్తోంది.

దక్షిణ కోస్తా జోన్‌కు శూన్యమే..

రైల్వే కేటాయింపుల్లోనూ అన్యాయమే..!

రైల్వే బడ్జెట్‌లో ఒడిశాకు అధిక నిధులు



తాటిచెట్లపాలెం : కేంద్ర బడ్జెట్‌లో మరోసారి అన్యాయమే జరిగింది. కొత్తగా ఏర్పాటు కానున్న దక్షిణ కోస్తా జోన్‌కు ఎటువంటి కేటాయింపులు జరగలేదు. దక్షిణ కోస్తా జోన్‌తో పాటు ప్రకటించిన రాయగడ డివిజన్‌కు మాత్రం అంబ్రెల్లా పనుల కింద రూ.1.50 కోట్లు కేటాయించారు. గత ప్రభుత్వం హయాంలోనే దక్షిణ కోస్తా జోన్‌ ప్రకటించారు. భవనాలను, స్థలాలను అప్పట్లోనే కేటాయించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గత నెలలో జోన్‌కు శంకుస్థాపన చేశారు. విశాఖ స్టేషన్‌ రీ డెవలప్‌మెంట్‌ గురించి ప్రకటించారు. కానీ ఇవేమీ ముందుకు సాగడం లేదు. బడ్జెట్‌లో దక్షిణ కోస్తా జోన్‌కు ఎటువంటి కేటాయింపులు చేయలేదు. ఏపీకి కేటాయింపులు ఉన్నా సింహభాగం దక్షిణ మధ్య రైల్వే పరిధిలోనే ఉన్నాయి.

ఒడిశాపై ప్రేమ.. ఏపీపై చిన్నచూపు

బడ్జెట్‌లో ఒడిశాకు రూ.10,599 కోట్లు కేటాయించగా, ఏపీకి మాత్రం అంతంతమాత్రంగా కేటాయింపులు చేశారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ ఏపీ, తెలంగాణ, ఒడిశా బడ్జెట్‌ కేటాయింపులు, ప్రతిపాదనలను వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా వివరించారు. సోమవారం సాయంత్రం దొండపర్తిలోని వాల్తేర్‌ డివిజనల్‌ రైల్వే మేనేజర్‌ కార్యాలయంలో కేంద్ర మంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. 2025–26 బడ్జెట్‌లో ఒడిశాకు 10,599 కోట్లు కేటాయించగా ఏపీకి మాత్రం రూ.9,417 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. వీటిలో స్టేషన్‌ రీ డెవలప్‌మెంట్స్‌ ప్రాజెక్టులు, కొత్త ట్రాక్స్‌ ఏర్పాటు, విద్యుదీకరణ, మౌలిక వసతులు కల్పిస్తారు. విశాఖ స్టేషన్‌ రీ డెవలప్‌మెంట్‌ గురించి ప్రకటించారు.. కాని ఇవేమీ ముందుకు సాగలేదు. దక్షిణ కోస్తా జోన్‌కు కేటాయింపులు లేవు.

10 స్టేషన్ల అభివృద్ధి

అనంతరం బడ్జెట్‌ కేటాయింపులపై డీఆర్‌ఎం మనోజ్‌కుమార్‌ సాహూ మాట్లాడారు. వాల్తేర్‌ డివిజన్‌ పరిధిలో 10 స్టేషన్లను అమృత్‌ భారత్‌ స్టేషన్ల కింద అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఏపీకి ఒడిశా కంటే దాదాపు వెయ్యి కోట్లు తక్కువ కేటాయింపులు చేసినా డీఆర్‌ఎం మాత్రం రికార్డు కేటాయింపులంటూ హర్షం వ్యక్తం చేశారు. త్వరలో పింక్‌బుక్‌ వస్తుందని, దీనిలో పూర్తి వివరాలు పొందుపరుస్తారని డీఆర్‌ఎం తెలిపారు.

ఫార్మా ఎక్స్‌పో అదుర్స్‌



ఎక్స్‌పోలో ఫార్మా యంత్ర పరికరాల స్టాల్‌



జేఎన్‌పీసీ మ్యానుఫ్యాక్చరింగ్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి జెట్టి సుబ్బారావుకు సత్కారం

పరవాడ : ఫార్మాసిటీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన 'వైజాగ్‌ ఫార్మా అండ్‌ ల్యాబ్‌ ఎక్స్‌పో' (ఎగ్జిబిషన్‌) ఆకట్టుకుంటోంది. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఎక్స్‌పోను జేఎన్‌పీసీ మ్యానుఫ్యాక్చరింగ్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు ఎన్‌.సూర్యప్రకాష్‌, శివరామప్రసాద్‌, ఎస్‌.ఎస్‌.రావు, జెట్టి సుబ్బారావు, అజిత్‌కుమార్‌ శుక్లాలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జేఎన్‌పీసీ మ్యానుఫ్యాక్చరింగ్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి జెట్టి సుబ్బారావు మాట్లాడుతూ దేశ నలుమూలల నుంచి హాజరైన 180 సంస్థలు రెండు వేల అధునాతన ఫార్మా ఉపకరణాలను స్టాళ్లలో ప్రదర్శించి వాటి ప్రయోజనాలను వివరించినట్లు తెలిపారు. ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న అధికారులు, పరిశ్రమల నిపుణులు ఫార్మారంగంలో తాజా ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతికతపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పరవాడ, నక్కపల్లి, పైడిభీమవరం, అచ్యుతాపురం ప్రాంతాల్లోని పరిశ్రమల యాజమాన్యాలు, అందులోని నిపుణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన్ని జేఎన్‌పీసీ మ్యానుఫాక్చరింగ్‌, మ్యూచువల్లీ ఎయిడెడ్‌ సొసైటీ ఫర్‌ రిస్క్‌ మిటిగేషన్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.





ఎక్స్‌పోలో ప్రదర్శించిన ఫార్మా యంత్ర పరికరాల స్టాళ్లు

11 మంది విద్యార్థులకు అస్వస్థత



గోపాలపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు



విద్యార్థులను పరామర్శిస్తున్న డిప్యూటీ మేయర్‌ జియ్యాని శ్రీధర్‌

- తరగతి గదిలో దుర్వాసనతో వాంతులు చేసుకున్న విద్యార్థులు
- హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్‌ పాఠశాలలో ఘటన
- ఆరోగ్యం కుదుటపడడంతో ఇంటికి పంపిన వైద్యులు

గోపాలపట్నం : దుర్వాసనతో 11 మంది విద్యార్థులు వాంతులు చేసుకొని అస్వస్థతకు గురైన ఘటన జీవీఎంసీ 92వ వార్డు హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో సోమవారం చోటుచేసుకుంది. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లడంతో ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం యథావిధిగా తరగతులు ప్రారంభమయ్యాయి. మూడో పీరియడ్‌ సమయంలో ఎనిమిదో తరగతి గదిలో దుర్వాసన వచ్చింది. కొద్దిసేపటికి 11 మంది విద్యార్థులు వాంతులు చేసుకొని అస్వస్థతకు గురయ్యారు. ఆ సమయంలోనే పాఠశాలలో వైద్యాధికారులు మెడికల్‌ క్యాంప్‌ నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలియగానే వైద్యులు అస్వస్థతకు గురైన విద్యార్థులను పరీక్షించి ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఆ ప్రాంతంలోని అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌కి ఇద్దరు విద్యార్థులను తరలించి ప్రథమ చికిత్స అందించారు. మరో తొమ్మిది మందిని గోపాలపట్నం ఆస్పత్రికి తరలించి సెలైన్లు ఎక్కించారు. ఆరోగ్యం కుదుటపడడంతో సాయంత్రం వారిని ఇంటికి పంపించారు.


శనివారం ఆ గదిలో దుర్వాసన వచ్చిందని విద్యార్థులు ఫిర్యాదు చేయగానే శుభ్రం చేయించామని పాఠశాల హెచ్‌ఎం అప్పారావు తెలిపారు. శుభ్రం చేసిన సమయంలో కోడిగుడ్లు పెంకులు కనిపించాయని వాటి వల్లే ఈ దుర్వాసన వచ్చి ఉండవచ్చని భావించామన్నారు. సోమవారం ఉదయం తరగతి గది తలుపులు తీసినప్పుడు ఎటువంటి దుర్వాసన రాలేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అయితే మూడో పీరియడ్‌ సమయంలో దుర్వాసన ఎలా వచ్చిందో తెలియడం లేదని అంటున్నారు.

విద్యార్థులకు పరామర్శ

అనారోగ్యానికి గురైన విద్యార్థులను డిప్యూటీ మేయర్‌ జియ్యాని శ్రీధర్‌ పరామర్శించారు. ఈ ఘటన ఏవిధంగా జరిగిందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని వాపోయారు. విద్యార్థులకు ప్రాణాంతకంగా మారితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పలు అనుమానాలు ఉన్నాయని, విద్యార్థుల బాగోగులు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వాంతులకు గురి చేసే స్థాయిలో దుర్వాసన రావడంపై పూర్తి స్థాయిలో పరిశోధించాలన్నారు. గోపాలపట్నం తహసీల్దార్‌ సీహెచ్‌ రమేష్‌ ఆస్పత్రికి వచ్చి విద్యార్థుల అస్వస్థతకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, ఎంఈవోలు దివాకర్‌, సోమేశ్వరరావు పరామర్శించారు.

కమ్ముకుంటున్న క్యాన్సర్‌ ముప్పు

- ఏటా పెరుగుతున్న రోగులు
- కేజీహెచ్‌కు రోగుల తాకిడి
- భారీగా పెరిగిన ఓపీ, ఐపీ సేవలు
- నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు
- రూ.40 కోట్లతో లేనాక్‌ మిషన్‌ ఏర్పాటు



మహారాణిపేట : క్యాన్సర్‌ బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. మానవ జీవన శైలిలో మార్పుల వల్ల మహమ్మారి రోజురోజుకు విజృంభిస్తోంది. పొగాకు వాడే స్త్రీలకు నోటి క్యాన్సర్‌, మహిళల్లో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌, బ్రెస్ట్‌ క్యాన్సర్‌ వ్యాపిస్తోంది. గతంలో పొగతాగే వారికి మాత్రమే సోకే లంగ్‌ క్యాన్సర్‌.. ఇప్పుడు అనేక మందికి సోకుతోంది. జంక్‌ ఫుడ్‌కు అలవాటు పడుతున్న ప్రజలు లివర్‌, పేగు క్యాన్సర్లకు గురవుతున్నారని వైద్యులు చెబుతున్నారు. తగినంత వ్యాయమం లేకపోవడం, పొగాకు వినియోగం, ఖైనీ, ఆల్కహాల్‌, వివిధ రకాల ఫాస్ట్‌ఫుడ్‌ వల్ల క్యాన్సర్‌ బారిన పడుతున్నారు. ప్రపంచ క్యాన్సర్‌ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

కేజీహెచ్‌లో మూడు విభాగాల్లో వైద్యం

కేజీహెచ్‌లో సమగ్ర క్యాన్సర్‌ విభాగం ద్వారా మెడికల్‌ ఆంకాలజీ, రేడియేషన్‌ ఆంకాలజీ, సర్జికల్‌ ఆంకాలజీ విభాగాల్లో క్యాన్సర్‌ రోగులకు వైద్యం అందిస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలు, ఒడిశా, అండమాన్‌ నికోబార్‌ ప్రాంతాల నుంచి రోగులు కేజీహెచ్‌లో క్యాన్సర్‌ వైద్య సేవలకు తరలివస్తున్నారు. ఒక్క రేడియేషన్‌ ఆంకాలజీ విభాగంలో ఏడాదికి 800 మంది వరకు చికిత్స పొందుతున్నారు. ఇప్పటివరకు రేడియేషన్‌ అవసరమైన రోగులకు కోబాల్ట్‌ 60 మిషన్‌ ద్వారా వైద్యం చేస్తున్నారు.

లేనాక్‌ మిషన్‌ ద్వారా అత్యాధునిక వైద్యం



కేజీహెచ్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన రూ.40 కోట్ల విలువ గల లేనాక్‌ మిషన్‌ ద్వారా క్యాన్సర్‌ రోగులకు అత్యాధునిక వైద్య సేవలు అందించనున్నట్లు కేజీహెచ్‌ రేడియేషన్‌ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్‌ పాండురంగ కుమారి తెలిపారు. గతంలో క్యాన్సర్‌ పుండు ఎక్కడ ఉండేదో ఆ ఏరియా అంతా రేడియేషన్‌ ఇచ్చేవారని, ఈ అడ్వాన్స్‌డ్‌ మిషన్‌ ద్వారా ఎక్కడ క్యాన్సర్‌ పుండు ఉందో అదే ఏరియాలో మాత్రమే రేడియేషన్‌ ఇవ్వడానికి వీలు కలుగుతుందన్నారు. అలాగే బ్రెయిన్‌ ట్యూమర్‌ వంటి రోగాలను సైతం వారం రోజుల వ్యవధిలోనే పూర్తిస్థాయిలో నయం చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. వాస్తవానికి ఇవే వైద్య సేవలకు ప్రైవేట్‌ ఆసుపత్రుల్లో రూ.2 నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని, కేజీహెచ్‌లో పూర్తిగా ఉచితంగానే అందిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెంటెంట్‌ డాక్టర్‌ పి.శివానంద్‌ పేర్కొన్నారు. కేజీహెచ్‌లో ఈ లేనాక్‌ మిషన్‌ ఇన్‌స్టలేషన్‌ ప్రక్రియ పూర్తయింది. రోగులకు సేవలు అందించేందుకు మరో మూడు నెలల సమయం పడుతుందని తెలిపారు.

విస్తృతంగా అవగాహన

గ్రామ స్థాయి నుంచి ప్రజలకు క్యాన్సర్‌పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కేజీహెచ్‌ వైద్యులు చెబుతున్నారు. గ్రామ స్థాయిలో క్యాన్సర్‌ రోగులను గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించేందుకు కేజీహెచ్‌కు రిఫర్‌ చేస్తున్నారని... వారందరికీ ఇక్కడ అవసరమైన పరీక్షలు నిర్వహించి ఉచితంగా సేవలు అందిస్తున్నట్లు సూపరింటెండెంట్‌ డాక్టర్‌ శివానంద తెలిపారు. వారంలో రెండురోజుల పాటు ప్రత్యేకంగా క్యాన్సర్‌ ఓపీ నిర్వహించి రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నట్లు పేర్కొన్నారు.

గతేడాది 8,174 మందికి వైద్యం

కేజీహెచ్‌లోని మెడికల్‌ ఆంకాలజీ, రేడియేషన్‌ ఆంకాలజీ, సర్జికల్‌ ఆంకాలజీ విభాగాల్లో గత ఏడాది జనవరి 1 నుంచి డిసెంబర్‌ 31వ తేదీ వరకు మొత్తం 8174 మంది క్యాన్సర్‌ రోగులు వైద్య సేవలు పొందారు. ఇన్‌పేషంట్‌గా 4,741 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. 5,994 మంది కిమో థెరఫీ, 528 మందికి రేడియో థెరఫీ చికిత్స పొందారు. 149 మందికి మేజర్‌ సర్జరీలు, 103 మైనర్‌ సర్జరీలు జరిగాయి.



రోడ్లపై కొంత మంది యువత రెచ్చిపోతున్నారు. బైక్‌లను ఇష్టానుసారంగా నడుపుతూ చెలరేగిపోతున్నారు. పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్లపై దృష్టిసారించినప్పటికీ.. వాహనాలకు నంబర్ పేట్లను మాత్రం పరిశీలించడం లేదు. నగరంలో అనేక మంది వాహనదారులు నంబర్ ప్లేట్లు లేకుండా తిరిగేస్తున్నారు. కొంత మంది పోలీస్ సిబ్బంది వాహనాలకు కూడా నంబర్ పేట్లు లేకపోవడం గమనార్హం. అందుకు ఈ చిత్రాలే సాక్ష్యం.

– ఫొటోలు : సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం





రాళ్ల గుట్టల మధ్య రాయిగా అమ్మవారు



అమ్మవారికి మొక్కి చెట్టుకు కట్టిన చీరలు



మొక్కులు చెల్లించి గుట్టపై వేసిన ఇటుకలు

రాళ్లే నైవేద్యం

ఆలయాలకు వెళ్లే భక్తులు కొబ్బరికాయలు కొట్టి, పువ్వులు, నెయ్యి, పాలతో దూప, దీప నైవేద్యాలు సమర్పిస్తారు. కానీ ఆనందపురం మండలం పాలవలస వెలిసిన పాలమ్మ (పోలమ్మ) వారికి మాత్రం భక్తులు రాళ్లు సమర్పిస్తే చాలు అమ్మ కరుణిస్తుందని, కోరిన కోర్కెలు నెరవేరుస్తుందని భక్తుల నమ్మకం.

– తగరపువలస

దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆచారం

కోరిన కోర్కెలు తీరుస్తున్న రాళ్ల పాలమ్మ

ఆనందపురం మండలం పాలవలస పంచాయతీలో జాతీయ రహదారిపై దుక్కవానిపాలెం టోల్‌ప్లాజాను ఆనుకుని మెట్టపై వెలసిన పాలమ్మ అమ్మవారు వందల ఏళ్ల క్రితం రాయి రూపంలో వెలిశారు. అమ్మవారు చీకటి పడిన తరువాత స్త్రీ రూపంలో చుట్టుపక్కల వారికి కనిపించేవారట. తానుండే చోట రాళ్లు వేస్తే కోరికలు తీరుతాయని చెప్పడంతో.. భక్తులు రాళ్లు నైవేద్యంగా సమర్పించడం మొదలపెట్టారు. ప్రస్తుతం అక్కడ రాళ్ల గుట్టలు వెలిశాయి. విద్య, వైద్యం, పెళ్లి, భూ సమస్యలు, వ్యాపారం, ఆరోగ్యం, కోర్టు వ్యవహారం, ప్రయాణం కోసం రాళ్ల పోలమ్మకు మొక్కులు తీర్చుకుంటూ ఉంటారు. రాళ్లతో పాటు పసుపు–కుంకుమ ఇచ్చి కోళ్లు, మేకలు కోసి బంధువులకు భోజనాలు కూడా పెడుతుంటారు. మంగళ, శుక్ర, ఆదివారాల్లో ఇక్కడ భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. రెండు రాళ్ల గుట్టల మధ్య ఇటుకలు పేర్చి రాయి రూపంలో అమ్మవారు పూజలు అందుకుంటున్నారు. అమ్మవారికి చీరలు మొక్కేవారు అక్కడి దేవతా వృక్షాలకు కట్టి వదిలేస్తారు. అంతేకాకుండా తమ సంతానికి రాళ్ల పాలమ్మ పేరుపెట్టి తలనీలాలు కూడా సమర్పిస్తుంటారు. అమ్మవారు కోరితే ఆలయం, భక్తులు సేదతీరడానికి వసతులు, తాగునీరు ఏర్పాటు చేస్తామంటున్నారు పాలవలస ప్రజలు.

రాళ్ల జోలికి ఎవరూ వెళ్లరు : చుట్టూ కొండలు, తోటలతో కేవలం కాలిబాట మాత్రమే రాళ్ల పాలమ్మ ఆలయానికి ఉండేది. దీంతో ఉదయం, సాయంత్రం వేళ మాత్రమే భక్తులు గుంపులుగా వచ్చేవారు. 20 ఏళ్ల క్రితం ఇక్కడ ఇటుక బట్టీలు ప్రారంభించిన తమ్మిన కుటుంబ సభ్యులు చుట్టూ కొండను చదునుచేసి తుప్పలను తొలగించారు. దీంతో రాత్రి వేళ కూడా ఈ మార్గంలో నిర్భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో గుట్టలుగా ఉన్న రాళ్లను ఇళ్ల నిర్మాణ కోసం పలువురు తీసుకుపోవడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. వాహనాలు కదలకపోవడం, మరమ్మతులకు గురై రోజుల తరబడి నిలిచిపోవడం జరిగింది.



రహదారి పక్కన రాళ్ల గుట్టలు

రాళ్ల పాలమ్మగా ప్రాచుర్యం



మా పూర్వీకుల నుంచే రాళ్ల పోలమ్మగా అమ్మవారు ప్రాచుర్యం పొందారు. అమ్మవారికి కేవలం రాళ్లు నైవేద్యంగా సమర్పిస్తే చాలు కోరిన కోర్కెలు ఫలిస్తాయి. దశాబ్దాలుగా ఆ నమ్మకం కొనసాగుతోంది.

– తొమురోతు పైడితల్లి

ఈ ప్రాంతాన్ని శుభ్రం చేశాం



మాకు ఈ ప్రాంతంలో ఇటుక బట్టీలు ఉన్నాయి. 20 ఏళ్ల క్రితం రాళ్ల పాలమ్మ గుడికి భక్తులు రాలేకపోయేవారు. దీంతో ఈ ప్రాంతం శుభ్రం చేయించాం. ఇప్పుడు భక్తులు ఏ సమయంలోనైనా వాహనాలపై రాగలుగుతున్నారు.

– తమ్మిన అప్పలరాజు

వసతులు అవసరం



రాళ్ల పాలమ్మ వారికి ఆలయం, ఇక్కడకు వచ్చే భక్తులకు వసతులు కల్పించాలనుకుంటున్నాం. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారు అనుగ్రహిస్తే షెడ్లు నిర్మిస్తాం.

– చెల్లుబోయిన గణేష్

వ్యాపారాల్లో విజయం



ఈ చుట్టుపక్కల గ్రామాల్లో వ్యాపారాల కోసం వచ్చేవారు రాళ్ల పాలమ్మను విశేషంగా నమ్ముతారు. అమ్మవారికి చీరలు, సారెలు, కోళ్లు, మేకలు సమర్పించి వ్యాపారాలలో విజయం సాధిస్తుంటారు.

– షిణగం వెంకటేష్

కల్యాణ మండపాల లీజు రద్దు చేయాలి

- సింహాచలంలో సనాతన ధర్మ పరిరక్షణ సమితి దీక్షలు

సింహాచలం: సింహగిరిపై కల్యాణమండపాలను అద్దెకిచ్చేందుకు వేలంపాటల ద్వారా లీజుకిచ్చే విధానాన్ని సింహాచలం దేవస్థానం పూర్తిగా రద్దు చేయాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి జేఏసీ డిమాండ్ చేసింది. ఈ విధానాన్ని వెంటనే నిలుపుదల చేయాలని సింహాచలంలోని కొండదిగువ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా రిలే నిరాహారదీక్షలకు సోమవారం శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ పూడిపెద్ది శర్మ మాట్లాడుతూ సింహాచలం దేవస్థానంలో మూడేళ్ల నుంచి కల్యాణమండపాలకు వేలంపాటలు నిర్వహించి కాంట్రాక్టర్లకు లీజుకిచ్చే విధానాన్ని అమలు చేస్తున్నారని ఇది ఎంతమాత్రం తగదన్నారు. లైసెన్స్ హక్కు దక్కించుకున్న కాంట్రాక్టర్ పెళ్లి బృందాల వద్ద నుంచి అధిక మొత్తంలో నగదు వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ముఖ్యంగా పేద కుటుంబాలు పెళ్లి చేసుకోవాలంటే గగనంగా మారిందన్నారు. దీక్షలో హిందూ జేఏసీ కార్యదర్శి మీసాల రవీంద్ర, నాయకులు నాగభూషణం, కాళ్ల జగన్‌మోహన్, చందు తదితరులు పాల్గొన్నారు.



తొలిపావంచా వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సనాతన ధర్మ పరిరక్షణ జేఏసీ నాయకులు

ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

మహారాణిపేట: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నేక్) నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్‌ఎస్ రవికుమార్ తెలిపారు. పదో తరగతి పాసైన 15 నుంచి 45 ఏళ్ల లోపు వారికి ఈ కోర్సులో మూడు నెలలపాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. వివరాలకు 7989572981, 8309059974 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆర్డీవోపై దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తిపై చర్యలకు సిద్ధం

పెందుర్తి: పెందుర్తి రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీవో శ్రీలేఖపై దౌర్జన్యానికి పాల్పడిన డీవీ మహేష్ పై పోలీసులు చర్యలకు సిద్ధమవుతున్నారు. స్వయంగా ఆర్డీవో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేష్‌పై 132, 351(2), 79 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వివరాలివి.. గత సోమవారం పెందుర్తి రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆర్డీవో శ్రీలేఖ హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన మురళీనగర్‌కు ప్రాంతానికి చెందిన డీవీ మహేష్ వేపగుంటలోని ఓ స్థలం విషయంలో తన సమస్యను పరిష్కరించాలని ఆర్డీవోను డిమాండ్ చేశాడు. అయితే ఆ స్థల వివాదం కోర్టులో ఉందని అధికారులు మహేష్‌కు చెప్పారు. అయితే ఆర్డీవో సహా ఇతర రెవెన్యూ అధికారుల మాటలు పట్టించుకోకుండా కోపంతో ఊగిపోయాడు. ఆర్డీవో సహా తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బందిపై దుర్భాషలకు దిగాడు. అతడి చేతిలో ఉన్న పత్రాలను అధికారుల మొహాలపై విసిరి కొట్టాడు. అంతే కాకుండా రెవెన్యూ కార్యాలయం ఆవరణలో వీరంగం సృష్టించాడు. అధికారుల అనుమతి లేకుండా కార్యాలయం ప్రాంగణంలోనే కొన్ని మీడియా చానళ్లతో మాట్లాడుతూ అధికారులపై తీవ్రమైన ఆరోపణలు చేసినట్లు ఆర్డీవో శ్రీలేఖ పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన సీఐ కేవీ సతీష్‌కుమార్ దర్యాప్తు వేగవంతం చేశారు. మరోవైపు మహిళా ఆర్డీవోపై దౌర్జన్యానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మహేష్‌పై గతంలో పలు కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. తాను న్యాయవాదినని అని చెప్పుకుంటూ భూ కబ్జాలకు పాల్పడతాడని పలువురు బాధితులు పోలీసులకు చెప్పినట్లు సమాచారం.

డిగ్రీ విద్యార్థి అనుమానాస్పద మృతి



పూర్ణచంద్రరావు (ఫైల్)

సబ్బవరం: మండలంలోని పెదనాయుడుపాలెం శివారు కొత్తరోడ్డు సమీపంలో యువకుడు అనుమానాస్పదంగా సోమవారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెదనాయుడుపాలెం శివారు కొత్తరోడ్డుకు చెందిన నారపాడు పూర్ణచంద్రరావు (23) కోటపాడు సమీపంలో ఆదివారం రాత్రి ఓ వివాహానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో స్నేహితులతో కలిసి వచ్చాడు. అనంతరం ఇంటికి వెళ్లిపోయాడు. కొద్ది సేపటి తరువాత పూర్ణచంద్రరావుకు ఫోన్ రావడంతో బయటకు వెళ్లాడు. ఇంటికి సమీపంలో ఉండే తమ కల్లంలో ఉరివేసుకొని ఉన్నట్లు కుటుంబ సభ్యులు సోమవారం తెల్లవారు జామున గుర్తించారు. తండ్రి గోవింద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సింహాచలం తెలిపారు. పరవాడ డీఎస్పీ వల్లెం విష్ణుస్వరూప్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మృతుడు పూర్ణచంద్రరావు విశాఖలోని ఓ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు.

ఉపాధి కూలీ మృతి



గురువులు (ఫైల్)

పద్మనాభం: మండలంలోని రేవిడి పంచాయతీ రౌతులపాలెం సారిక వాని కల్లాల్లోని కాలువలో సోమవారం ఉపాధి హామి పథకం పనులు చేస్తుండగా కూలీ దుర్మరణం చెందాడు. రౌతులపాలెం కాలనీకి చెందిన సారిక గురువులు (65) సారిక వాని కల్లాల్లో ఎర్ర చెరువు నుంచి బట్టి పొలానికి అనుసంధానంగా ఉన్న కొండ కాలువలో ఉపాధి పనులు చేస్తుండగా ఉదయం 8.30 గంటల సమయంలో అక్కడికక్కడే కుప్ప కూలిపోయాడు. మృతుడు గురువులకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



గురువులు మృత దేహం వద్ద రోదిస్తున్న బంధువులు

సింహగిరిపై విశేషంగా అక్షరాభ్యాసాలు

సింహాచలం: వసంత పంచమిని పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు విశేషంగా జరిగాయి. ఉదయం 9గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనారాయణస్వామి వ్రతాల మండపంలో ఈకార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత లక్ష్మీనారాయణస్వామి సన్నిధిలో విశేషంగా పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులతో వాళ్ల తల్లిదండ్రులు అక్షరాలను దిద్దించారు. చిన్నారులకు, వాళ్ల తల్లిదండ్రులకు అర్చకులు స్వామివారి ఆశీస్సులు అందజేశారు. తల్లిదండ్రులు,వాళ్ల చిన్నారులతో వ్రతాల మండపం కిక్కిరిసింది.



పూజల్లో పాల్గొన్న భక్తులు

మూడు ఇసుక లారీల స్వాధీనం

అక్కిరెడ్డిపాలెం : నిబంధనలకు వ్యతిరేకంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇసుక లోడుతో తిరుగుతున్న మూడు లారీలను గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి పట్టుకున్నారు. సోమవారం రాజమండ్రి నుంచి గాజువాక బీసీ రోడ్డులో మూడు ఇసుక లారీలు ఉన్నట్లు తహసీల్దార్ శ్రీవల్లి దృష్టికి వచ్చింది. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి ఆరా తీశారు. రాజమండ్రి నుంచి ఇసుక తరలిస్తున్నట్లు లారీ డ్రైవర్ తెలిపాడు. ఇందుకు సంబంధించి బిల్లులు రాజమండ్రివి కావడంతో లారీలను సీజ్ చేసి గాజువాక రెవెన్యూ కార్యాలయానికి తరలించారు.



లారీల రికార్డులను పరిశీలిస్తున్న గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.120
స్కిన్	: రూ.210
స్కిన్‌లెస్	: రూ.220

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.84,050
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.77,050
వెండి(కిలో):	రూ.1,07,000

అలా.. మత్స్యలోకంలో..









సాగర తీరంలో ఉన్న మత్స్య పరిశోధన కేంద్రం 71వ వార్షికోత్సవం భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను నగరంలోని పలు పాఠశాల విద్యార్థులు సందర్శించారు. వివిధ జల పుష్పాలు, అరుదైన చేపలు, వాటిని నిల్వ చేసే కెమికల్స్ ప్రదర్శించారు. సముద్రం అడుగు భాగంలో పెరిగే మొక్కలను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. మత్స్య సంపదపై ఆ శాఖ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

– బీచ్‌రోడ్డు/ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్